క్లుప్తంగా

సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ అశోక్



కొడకండ్ల: వేసవి సెలవులు పిల్లలకు ఆటపాటలు, స్నేహితులతో సరదాగా గడిపే సమయం కాని నేడు అందుకు భిన్నంగా చాలా మంది పిల్లలు సెల్ ఫోన్‌లకే పరిమితమవుతూ వినోదం, ఆటలు, సామాజిక మాధ్యమాల కోసం గంటల తరబడి ఫోన్లలో మునిగిపోతుండటంతో శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పోగు అశోక్ తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తలిదండ్రులు బాధ్యత వహించాలని, అధికంగా సెల్ ఫోన్ ఉపయోగం వలన శారీరక సమస్యలతో పాటు కంటి సమస్యలు, నిద్రలేమి, బరువు పెరగడం, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. మానవీయ సంబంధాలు బలహీన పడటం, సామాజిక నైపుణ్యాలు తగ్గుతాయని, వీటిని అధిగమించేందు కోసం ఫోన్ వినియోగంపై పరిమితిని విధించడం, ప్రత్యామ్నాయ కార్యకలాపాలను ప్రోత్సహించడం, కుటుంబంతో గడిపే సమయాన్ని తల్లిదండ్రులు పిల్లల్లో కల్పించాలన్నారు. వేసవి శిబిరాలు, శిక్షణ తరగతులకు పంపాలి, సెల్ ఫోన్ వినియోగం ద్వారా కలిగే నష్టాలను వివరిస్తూ ఫోన్ వినియోగంకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఆయన సూచించారు. పిల్లల భద్రత, ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వేసవి సెలవుల్లో పిల్లల పట్ల బాధ్యతగా ఉంటూ సంరక్షకులుగానే కాకుండా స్నేహితులు, మార్గదర్శకులుగా ఉంటూ వారి భవిష్యత్‌కు బలమైన పునాది వేయాలని అశోక్ సూచించారు.

3న వేలం



మాట్లాడుతున్న ఈఓ వంశీ

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్దేశ్వరాలయంలో వివిధ హక్కుల కోసం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. వేలం పాటను మే 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయం వేలం పాటకు రూ. 2 లక్షలు, స్వామి వారి లడ్డూ, పులిహోరకు రూ. 50 వేలు, తలనీలాలు పోగు చేసుకునేందుకు రూ.1.50 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునేందుకు రూ. 25 వేల డీడీ తీసి ఆలయ అధికారులకు అందించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఆసక్తిగల పాటదారులు సంబంధిత బ్యాంకు డీడీలతో వేలంలో పాల్గొనాలని సూచించారు. ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, ఆలయ సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాష్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



చందన మహిళా మండలి సమాఖ్య కార్యవర్గం

దేవరుప్పుల: చందన మహిళా మండలి సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని చందన సమాఖ్య మండల స్థాయి సమావేశానికి ప్రస్తుత అధ్యక్షురాలు నల్ల ఉమ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎన్నికల నియమావళి మేరకు ఆయా గ్రామాల వీఓ ప్రతినిధుల ఏకాభిప్రాయం మేరకు నూతన కార్యవర్గం అధ్యక్షురాలుగా పులిపంపుల మమత, ఉపాధ్యక్షురాలుగా కొలుపుల లక్ష్మి, కార్యదర్శిగా మునిగొండ శారద, సహాయ కార్యదర్శిగా అమృతం యమున, కోశాధికారిగా శైలజ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం ఐబీ వరలక్ష్మి, ఆర్‌ఎం నిర్మల, నాగేశ్వరరావు, ఐకేపీ సీసీలు సోమనారాయణ, శంకర్, సుదర్శన్, సంధ్య, వెంకన్న, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

తొర్రూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కర్కాల గ్రామం నుంచి అరిపిరాల గ్రామం వరకు చేపట్టిన జైబాపు. జైబీమ్, జైసంవిధాన్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై బీజేపీ నాయకులు అవమానించే విధంగా మాట్లాడితే ప్రజల తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు హమ్యానాయక్, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, నాయకులు ఉన్నారు.

రైతుల ఆశలు ఆవిరి!

- పతనమవుతున్న పొగాకు ధరలు
- కూలీల ఖర్చు కూడా రాదంటున్న అన్నదాతలు
- దిక్కుతోచని స్థితిలో కర్షకులు
- క్వింటాకు రూ.5 వేల లోపే
- కొట్టాల వద్ద నిల్వ చేసుకున్న పరిస్థితి



కుర్చపల్లిలో కొట్టాల వద్ద నిల్వ చేసిన పొగాకు మండె

రఘునాథపల్లి: పొగాకు సాగుతో కష్టాలు తీరుతాయని ఆశ పడ్డ రైతుల ఆశలు అడియాసలయ్యాయి. రోజు రోజుకు పతనమవుతున్న ధరలతో నష్టాల ఊబిలో కురుకుపోయే దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధర లేక పోవడంతో ఇళ్లు, కొట్టాల్లో నిల్వ చేసుకుని ధర కోసం ఎదురు చూస్తున్నారు. అమాంతం ధర పడిపోవడంతో ఏం చేయాలో పాలుపోక నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని కుర్చపల్లి, గోవర్ధనగిరి, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, గబ్బెట, కోడూర్, రామన్నగూడెం, జాఫర్‌గూడెం తదితర గ్రామాల్లో దాదాపు 1,800 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. గతేడాది క్వింటాల్‌కు రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకు ధర పలకడంతో ఈ ఏడాది ఎంతో ఆశగా రైతులు పొగాకు సాగు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రూ.8 వేల నుంచి రూ.2 వేలకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుర్చపల్లి గ్రా మంలో యేటా నాలుగైదు కంపెనీలు వచ్చి కొనుగోళ్లు చేపట్టగా ఈ సారి ఒకే కంపెనీ రావడంతో ఇష్టమొచ్చిన రేటుకు తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రఘునాథపల్లి, గబ్బెటలో కంపెనీ వారు కొనుగోలు చేసినా నాణ్యత లేదని తిరస్కరిస్తూ కొందరి రైతుల బేళ్లు వెనక్కి తిరిగి పంపిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లినా ధర లేక అల్లాడుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు వ్యాపారులు అడిగిన ధరకు ఇస్తే పెట్టుబడి నిండా మునగాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు నారు, కూలీల ఖర్చులు, ఎరువులు కలిపి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి అయినట్లు రైతులు చెబుతున్నారు. పండించిన పొగాకు బేళ్లను కంపెనీకి తీసుకెళ్తే నాణ్యత లేదని వెనక్కి పంపిస్తున్నారంటున్నారు. కొట్టాలు, ఇళ్లలోనే నిల్వ చేస్తే.. చేసిన అప్పునకు వడ్డీ రెట్టింపు అవుతుందని, అలా అని అమ్ముకుందామంటే కూలీ ల ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఉన్నతాధికారులు స్పందించి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎకరాకు రూ.30 వేల నష్టం



10 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఈ సారి సాగు ఖర్చులు బాగా పెరిగాయి. ఎకరాకు రూ.60 వేల పెట్టుబడి పెట్టా. కొంత అమ్మగా మిగతాది. కొట్టాల వద్ద మండె వేసి నిల్వ ఉంచా.. ధర పెరుగుతుందని ఎదురుచూస్తున్నాం. క్వింటా రూ.5 వేలు అడుగుతున్నారు. అది కూడా కొనేందుకు కంపెనీ వారు రేపు మాపంటూ తిప్పుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు రూ 30 వేలకు పైగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించాలి.

– వారాల రాజు, పొగాకు రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



గతేడాది క్వింటా రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకు రేటు పెట్టి కొనుగోలు చేశారు. ఈ సారి రూ.వెయ్యి నుంచి రూ.8 వేల లోపు రేటు వేస్తున్నారు. మా గ్రామంలో ఎప్పుడైనా నాలుగైదు కంపెనీలు వచ్చేవి. ఈ సారి ఒకే కంపెనీ రావడంతో ధర పతనమైంది. కంపెనీలు ఎక్కడ కొంటున్నారో తెలియడం లేదు. ఒక్కో రైతు బావుల వద్ద 50 క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నాయి. ధర మరింత పతనం అయితే పెట్టుబడి నిండా మునిగే పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి.

– సాదం అశోక్, రైతు, కుర్చపల్లి

సభ విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు

- టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పల్లా



జనగామ: ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజ తోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని 8 మండలాల కేడర్‌తో ఎమ్మెల్యే టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పట్టణం నుంచి మారుమూల పల్లె వరకు నాయకులు, కార్యకర్తలు అద్భుతంగా పని చేశారన్నారు. సభను గ్రాండ్ సక్సెస్ చేసేందుకు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారన్నారు. కేసీఆర్ తిరుగు ప్రయాణంలో నియోజకవర్గంలో అడుగుపెట్టిన మొదలు నుంచి ఎర్రవల్లి వ్యవసా యక్షేత్రం వరకు దారి పొడవున నాయకులు, కార్యకర్తలు చూపించిన ప్రేమ ఆప్యాయతలు మరువలేనివన్నారు.

కలిసి ముందుకు సాగుదాం

బచ్చన్నపేట: నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి ముందుకు సాగుదామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. రమణారెడ్డి, అనిల్‌రెడ్డి, పూర్ణచందర్ ఉన్నారు.



అధికారులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి



పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాయి కుటుంబానికి అండగా..

సాక్షి ఎఫెక్ట్..

'నా కొడుకును సంపేయండి' శీర్షికన ఈ నెల29న సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. అధికారులతో కలిసి కుర్మవాడకు చెందిన బాధితులు పర్ష మల్లయ్య, లక్ష్మి దంపతుల ఇంటికి వెళ్లారు. సాయిని పరామర్శించి భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే పల్లా ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులు సాయిని పరామర్శించారు.

– జనగామ

పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో పేద ప్రజల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం రూపంలో సాకారం చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన శిలాఫలకాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలోనే అర్హులైన పేదలకు సంక్షేమఫలాలు అందుతున్నాయన్నారు. గత నెల 16వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా శంకుస్థాపన చేసిన ఇందిరమ్మ ఇళ్ల శిలాఫలకాన్ని ప్రస్తుతం ఆవిష్కరించినట్లు తెలిపారు. హౌసింగ్ పీడీ మాత్రునాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, సీహెచ్.నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మారెడ్డి, ఇంద్రారెడ్డి, కుమారస్వామి, లింగారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎజెండా

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ఎజెండాయని, స్టేషన్‌ఘన్‌పూర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఇప్పగూడెం గ్రామంలో రూ.90లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్య,నాయకులు మంద రాజు, గొడుగు రాజయ్య, పల్లె రవీందర్, రాజిరెడ్డి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఇప్పగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామంలోని శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి దేవాలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. యాకయ్య, రవీందర్, ఎల్లగౌడ్ ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న కడియం

గ్రామ శివారులో ఇప్పగూడెం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు మ్యాచ్‌ను ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారుల కోరిక మేరకు కడియం కాసేపు సరదాగా వారితో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, అధికారులు

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

కొడకండ్ల/పాలకుర్తి: ధాన్యం కొనుగోళ్లను త్వరగా చేపడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ నిర్వాహకులను ఆదేశించారు. కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లోని ఏడునూతుల, కొడకండ్ల మార్కెట్‌లోని, శాతపురం, ఎల్లరాయని తొర్రూరు, దర్దేపల్లి, వల్మిడి గ్రామాల్లో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుని రైతులతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్లు చంద్రమోహన్, నాగేశ్వరాచారి, సీనియర్ అసిస్టెంట్ సుమన్, ఏపీఎం సత్యనారాయణ, ఎండీ నరేష్, ఆర్ఐ రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహించొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశ్‌రావు

బచ్చన్నపేట: అనుమతులు లేకుండా బెల్టు షాపులను నిర్వహించొద్దని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్‌లో ఎక్సైజ్ అధికారులు పలువురు బెల్టు షాపు నిర్వాహకులను బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో కేసులు నమోదు చేసినా మళ్లీ విక్రయిస్తున్నారనే సమాచారంతో పలువురిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికీ మార్పు రాకపోతే రూ.లక్ష చొప్పున జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సై రాధిక, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు బసవ జయంతి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని సోమనాథ కవి స్మృతి వనంలో విశ్వగురు బసవేశ్వరుని జయంతి బుధవారం ఉదయం 8గంటలకు నిర్వహించనున్నట్లు సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బసవేశ్వరుని జయంతి ఉత్సవాల్లో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

తరలిరావాలి

తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన సంక్షేమ శాఖ, బసవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి రవీంద్రభారతిలో ఉదయం 11 గటలకు నిర్వహించే బసవ జయంతిని జయప్రదం చేయాలని వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదిర్శ కడపల్ల సోమేశ్వర్, ఆ సంఘం రాష్ట్ర యువజన కార్యదర్శులు కొట్టె మహేస్, కొండ శ్రీను మంగళవారం ఒక ప్రటనలో కోరారు. ఈ కార్యక్రమానికి సీఎం రేంవత్‌రెడ్డి, కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. వీరశైవ లింగాయత్ బలిజ సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు కోరారు.

నేడు పశువైద్య శిబిరం

పాలకుర్తి: మండలంలోని రాఘవపురం గ్రామంలో నేడు(బుధవారం) పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శిబిరంలో ఆవులు, దూడలు గేదెలకు ఉచిత గాలికుంటు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. రైతులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డుల అందజేత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

జనగామ రూరల్: నేడు జిల్లాలోని పలువురు ఉద్యమకారులకు శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డులు–2025 అందించనున్నట్లు ఓయూ జేఏసీ చైర్మన్ దరువు అంజన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని విజయ కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు రంగారెడ్డి జిల్లాలో నింగి నేల మేము సైతం మీ ఆత్మీయ నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డులను రాష్ట్రంలోని తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులను గుర్తించి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిగోజు నర్సింహాచారి, సోమనర్సింహచారి, భవానీ, జి.కృష్ణ, సోమేశ్వరాచారి, సంజీవ, ప్రతాప్, సాయికిరణ్, సురేష్ మహాజన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బూస బొందమ్మ కుటుంబాన్ని గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి రూ.5వేల సాయం అందించారు. బొందమ్మ మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. బూస మురళి, సత్యం, శంకర్, యాదగిరి, పండుగ బద్రి, రొయ్యల దూమయ్య, సంపత్‌యాదవ్ ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: అప్పుల బాధతో హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుల మందుతాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఇంతల కుమారస్వామి(60) ఇంటి నిర్మాణానికి ప్రైవేట్ బ్యాంక్‌లో హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. లోన్ ఈఎంఐ చెల్లింపులో ఇబ్బందులు తలెత్తడంతో పాటు కుమారులు సహకరించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 28వ తేదీన వ్యవసాయ పొలం వద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. కాగా, మృతుడి భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలకులు



దేవరుప్పుల: మాట్లాడుతున్న రమేశ్



జనగామ రూరల్: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రమేశ్

దేవరుప్పుల: పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను పాలక వర్గాలు కార్పొరేట్ సంస్థల కోసం కాలరాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సన్నాహక కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఎం మండల కమిటీ సభ్యులు రెడ్డి రాజుల నారాయణ అధ్యక్షత వహించగా రమేశ్ పాల్గొని మాట్లాడారు. ప్రజా ఉద్యమాలకు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పురుడుపోసిన దేవరుపుల కేంద్రంలో మేడే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో సీపీఎం, సీఐటీయూ జెండాలు ఆవిష్కరించాలన్నారు. మేడే కార్యక్రమంలో కార్మికులు, రైతాంగం, కూలీలు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని రమేశ్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కాలరాస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, మరోవైపు ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపై భారాలు వేస్తుందని అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, గడ్డం యాదగిరి, కొప్పుల ఉప్పలయ్య, చింత మైసయ్య, దూస గాని సుమ, శ్రీను నాయక్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

జనగామ రూరల్: మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గబ్బెట గోపాల్ రెడ్డి భవనములో జిల్లా ఉపాధ్యక్షుడు మోటె శ్రీశైలం అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మే డే వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. చామకూర యాకూబ్, గూడేల్లి రాజు, దాయ నాగేష్, గొట్టేటి రాజు, ముల్కల లక్ష్మయ్య, మరికొక్కుల సాయిలు, లింగాల రాములు తదితరులు పాల్గొన్నారు.

అష్టదళ పాదపద్మారాధన పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ మోహన్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత, మహేష్, గాదె శేఖర్, హరిశంకర్, రాజేష్, విశాల్, కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రూ.1.24,882 అక్రమాలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ వసంత, చిత్రంలో అధికారులు తదితరులు

- మే 1 నుంచి పనుల జాతర మొదలు పెట్టాలి
- డీఆర్‌డీఓ వసంత

లింగాలఘణపురం: ఉపాధి హామీ పథకంలో జరిగిన 6వ విడత ఓపెన్ ఫోరంలో రూ.1,24,882లు అక్రమాలు జరిగినట్లు తేలింది. మండల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి అధ్యక్షతన ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేపట్టిన పనుల్లో జరిగిన అక్రమాలను సోషల్ ఆడిట్‌లో వెల్లడించారు. కాగా, డీఆర్‌డీఓ వసంత మాట్లాడుతూ వచ్చే మే నుంచి పనుల జాతర మొదలు పెట్టాలని, ఎక్కువ మంది కూలీలు పనికి వెళ్లే విధంగా చూడడమే కాకుండా కూలి కూడా గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేయించాలని సూచించారు. అంతేకాకుండా వ్యక్తిగత ప్రయోజనాలు కలిగే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా పనులు చేయించాలని, పొరపాట్లు జరుగకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. సోషల్ ఆడిట్‌లో ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీఓ రఘురామకష్ణ, ఇన్‌చార్జ్ ఏపీఓ భిక్షపతి, ఈసీ సతీష్, అన్ని గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.